ఘనంగా భోగి పండగ



సావ్వ పంచాయతీ మాలివలసలో గ్రామస్తులతో థింసా నృత్యం చేస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి



లక్కొండ సచివాలయం ప్రాంగణంలో సంబరాలు

- పల్లెలకు సంక్రాంతి శోభ
- వీధుల్లో భోగి మంటలు
- యువత, చిన్నారుల సందడి

డుంబ్రిగుడ/చింతపల్లి రూరల్/కొయ్యూరు: తెలుగు ప్రజల పెద్ద పండగ సంక్రాంతి వచ్చేసింది... సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వగ్రామాలకు తరలివచ్చారు. గ్రామాన్నీ సందడిగా మారాయి. పల్లెలకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. మామిడితోరణాలు, బంతిపూల దండలతో ఇళ్లను అందంగా అలంకరించారు. కుటుంబీకులు, బంధువులు, మిత్రులతో రాకతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి. పండగ ప్రత్యేక పిండివంటలతో ఘుమఘుమలాడుతున్నాయి. వీధులన్నీ రంగు రంగుల ముగ్గులు, ప్రత్యేకంగా అలంకరించి గొబెమ్మలతో ఆకట్టుకుంటున్నాయి. తెల్లవారుజామున వీధుల్లో భోగిమంట వేశారు. యువత, చిన్నారులు సందడి చేశారు. భోగి మంట వద్ద కాచిన నీటితో ఇంటిల్లిపాది స్నానాలాచరించి, కొత్త దుస్తులు ధరించి, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు భోడి పండ్ల వేసి, పెద్దలు ఆశీర్వదించి, కానుకలు అందజేశారు. పెద్ద పండగ వేడుకల్లో భాగంగా శనివారం భోగి పండగను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు.



రాజవొమ్మంగిలోని భోగి మంట వద్ద చిన్నారులు, యువత సందడి



పాడేరు ప్రధాన రహదారిలో భోగిమంట

ముగ్గుల, ఆటల పోటీలు నిర్వహించారు. డూడూ బసవన్న, గంగిరెద్దుల వారు ఆటపాటలతో సందడి చేశారు. థింసా నృత్యాలు, గిరిజన సంప్రదాయ వాయిద్యాల నడుమ సాంస్కృతిక వేడుకలు ఆకట్టుకున్నాయి. ఒకొరికొకరు భోగి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

డుంబ్రిగుడ: సావ్వ పంచాయతీలో మాలివలస తదితర గ్రామాల్లో గిరిజనులు థింసా నృత్యాలు చేస్తూ సంక్రాంతి పండగ నిర్వహించారు. ఎంపీపీ బాక ఈశ్వరి గ్రామాల్లో సందర్శించి పండగ వేడుకల్లో పాల్గొని సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంటలు వేసి ఆనందంగా ఉల్లాసంగా గడిపారు.

గంగవరం : లక్కొండ గ్రామ సచివాలయం ఆవరణలో గ్రామ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముగ్గులు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. గ్రామసచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో వారపు సంతకు జనం పోటెత్తారు. దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వస్త్ర వ్యాపారం జోరుగా సాగింది.

సంతకు పండగ శోభ



వారపు సంతకు వచ్చిన జనం

ముంచంగిపుట్టు: సంక్రాంతి పండుగతో శనివారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతకు జనాలు పోటెత్తారు. సంక్రాంతి పండుగ ముందు చివరి సంత కావడంతో దుస్తులు, నిత్యావసర ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేసేందుకు భారీగా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు వారపు సంతకు వచ్చారు. దీంతో ప్రతి దుకాణం కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహనరాకపోకలకు నియంత్రించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

అరకులోయ రూరల్: పెదలబుడు పంచాయతీ సరభగూడ గ్రామంలో శనివారం జరిగిన కర్యాక్రమంలో సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్ మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేసి, ఏజెన్సీలో పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. జీవో నంబర్–1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు మగ్గన్న, సహదేవ్, జగన్నాథం, గోపాల్, అర్జున్, మెంగునాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోహనాపురంలో వైద్య శిబిరం



గ్రామస్తులకు ఆరోగ్యభద్రతపై సూచనలిస్తున్న వైద్యాధికారులు భావన, ధర్మా

గంగవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషన్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన అన్నారు. మోహనాపురంలోని గ్రామ సచివాలయంలో 104 డాక్టర్ ధర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశా, సచివాలయ సిబ్బంది సేవలందించారు.

ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో మహిళలు, నేతలు

వై.రామవరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పనసలపాలెం గ్రామంలో శనివారం బీజేపీ నేతల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతు జి–20 ప్రాముఖ్యత, భారత దేశం గొప్పతనం, ప్రధాని మోదీ దేశానికి అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆపార్టీ నేతలు శ్రీనుబాబు, విష్ణుమూర్తి, రాజబాబు, లీలావతి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆటను ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రుడు

రాజవొమ్మంగి: మండలంలోని దోనెలపాలెంలో సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ పోటీలను సర్పంచ్ సవిరెల చంద్రుడు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో 14 టీమ్‌లు తలపడుతున్నట్టు తెలిపారు. ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

సీఐగా షేక్ బాజిలాల్ బాధ్యతల స్వీకరణ



షేక్ బాజిలాల్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ బాజిలాల్ శనివారంబాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన రవికుమార్ మచిలీపట్నం బదిలీపై వెళ్లారు. నూతన సీఐ బాజిలాల్ మాట్లాడుతు శాంతిభద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఊరువాడ సంక్రాంతి పండుగ సంప్రదాయబద్ధంగా జరగాలని అభిలషించారు. అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్టవేస్తాన్నారు

అడవి బిడ్డలకు అన్నదానం



జోగంపేటలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సత్యనారాయణ

కొయ్యూరు: తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న దుమంతి సత్యనారాయణ శనివారం 'అడవి బిడ్డలకు అన్నదానం ' పేరిట రాజేంద్రపాలెం పంచాయతీ జోగంపేటలో అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తులందరికి భోజనా న్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సేవతోనే సంతృప్తి ఆనందం కలుగుతుందన్నారు. నెలలో రెండు, మూడు సార్లు ఏజెన్సీలోని శివారు గ్రామాల్లో ఆదివాసీ, గిరిజనులకు భోజనం సదుపాయం కల్పిస్తున్నామన్నారు. గిరిజనులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తు లు సంతృప్తి వ్యక్తం చేశారు. శివ, రమేష్, కిరణ్, నరేష్, సతీష్, వసంత్ పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలపై చర్యలు తీసుకోవాలి



సంతలో తూనికలను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేతలు

ముంచంగిపుట్టు: మన్యంలోని వారపు సంతల్లో తూనికల్లో గిరిజన రైతులు మోసాలకు గురవుతున్నారని, వాటిని నివారించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం.ఎం.శ్రీను అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో గిరిజన సంఘం నేతలు వ్యాపారులు కొనుగోలు చేసే పంటలను తూనికల కాటాలను పరిశీలించారు. తూనికలు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ వారపు సంతల్లో గిరిజన రైతులు పంటలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తూనికలు సక్రమంగా ఉండడం లేదని, కధరల పట్టికలు ఉండడం లేదన్నారు. కాఫీ రైతులు పండించిన పార్చిమెంట్ కాఫీ రూ.270, అరేబిక చెర్రీ కాఫీ రూ.135, రెబస్తా చెర్రీ కాఫీ రూ.60 చొప్పున ధర ఉన్న అంతకన్న తక్కుగా కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టాలు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు సంబంధించి తూనికల్లో మోసాలను ఆరికట్టాలని, ధరల పట్టికలు ఉండేలా చూడలని,గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజన సంఘం మండల నేతలు పి.భీమరాజు, ఎస్.గాసిరందొర, జి.నారాయణ, లైకోన్, డ్రోబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేసి టోర్నీ ప్రారంభిస్తున్న ఈఈ బాబూరావు

మోతుగూడెం: సంక్రాంతి సందర్భంగా పొల్లూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ జెన్‌కో ఈఈ బాబూరావు, మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీతలు శనివారం ప్రారంభించారు. గత 23 ఏళ్లుగా గ్రామంలో ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపరాఉ. ఏఈ పవన్, శివశంకర్, బాలాజీ, పొల్లూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ శ్రేణులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గిరిజనులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అందరికీ మంజూరయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో పర్యటించి, స్థానిక సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చిన సత్యం, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ సివేరీ కొండలరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



బంగారుమెట్టలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ



వలసగెడ్డలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో శనివారం ఎంపీటీసీ సీహెచ్.కొండమ్మ చీరలను పంపిణీ చేశారు. స్థానిక వీఆర్‌వో రమేష్ తల్లి చెండా లింగమ్మ జ్ఞాపకార్థం చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టామని, తలారి జానకిరావు ఆర్థిక సాయంతో చీరల ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. పండుగ రోజుల్లో సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఎంపీటీసీ కొండమ్మ అన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్ చెండా జగన్నాథం, వైఎస్సార్ సీపీ నేత కృష్ణ మోహన్ తదితరుల పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని వలసగెడ్డ గ్రామంలోని ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలోని చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నిరుపేదలకు తమ వంతు సాయం అందించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చామని, కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు.

జగనన్న పాలనలో ఇంటింటా పథకాల పండగ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- పండగ వేళలోనూ ప్రజల చెంతనే
- గ్రామాల్లో 'గడప గడపకు' విశేష స్పందన



కరకవలసలో గిరిజనులకు పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ పథకాల పండగ కనిపిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గత్తుం పంచాయతీ కరకవలస, చీకటిపుట్టు, జువిపాడు, తోకవలస గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. సంక్రాంతి పండగా సందర్భంగా గిరిజనులు గిరిజన సంప్రదాయ డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 145 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి భోగి శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గిరిజనుల కష్ట సుఖాల్లో అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. సంక్రాంతి పండగను అందరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ పోతురాజు, ఎంపీటీసీ సంబాయు కొండమ్మ, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు జిన్ను, భీంనాయుడు, నాయుడు, రామకృష్ణ, అప్పన్న, కామరాజు, శామ్యూల్, సూరిబాబు, సొన్ను, రామరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సందడే సందడి



వై.రామవరంలో కాటికాపరి ప్రదర్శన



హరిదాసుల సందడి

- గ్రామాల్లో డూ బసవన్న, హరిదాసులు



ఆకట్టుకున్న హరిశ్చంద్ర వేషధారణ

వై.రామవరం/రాజవొమ్మంగి: పల్లెల్లో సంక్రాంతి సందడి దర్శనమిస్తోంది. డూడూ బసవన్న, హరిదాసులు, కాటికాపర్లు సందడి గ్రామాల్లో ప్రారంభమైంది. కాటికాపరి వంశానికి చెందిన వ్యక్తులు ఏజెన్సీలో ఒక్కొక్కరు కొన్ని గ్రామాలు పంచుకుని సంక్రాంతి పండుగ నుంచి శివరాత్రి వరకు గ్రామాల్లో సంచరిస్తారు. ఇందులో భాగంగా వై.రామవరం మండలానికి ప్రతీ ఏట కాటికాపరి వంశానికి చెందిన పేర్ల మరిడియ్య, అతని కుమారుడు దుర్గప్రసాద్ గ్రామంలోని ఇంటింటికి వెళ్తున్నారు. పితృదేవతలకు పూజలు చేసి, సంభావన స్వీకరిస్తున్నారు. ఆటపాటలతో పాటు ఇంద్రజాల ప్రదర్శనతో ఆనందం పంచుతున్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరునికి భోగి పూజలు



ఆలయం వద్ద మొదటి తీర్థం



కూరగాయల తీర్థం

ఘనంగా ప్రారంభమైన సంక్రాంతి మొదటి తీర్థం

చోడవరం: ఒక పక్క భోగి మంటల సందడి, మరో పక్క సంక్రాంతి తీర్థాలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో హడావిడి చోటుచేసుకుంది. చిన్నపిల్లలకు చిక్కులు తొలగిపోవాలంటూ భోగి పండ్లు వేసి వివిధ ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సాయంత్రం స్వామివారి తీర్థంలో గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టే బెలూన్లు, పిండివంటలు, పంచదార చిలుకలు కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపారు. రంగులరాట్నాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థం అంతా సందడి చోటుచేసుకుంది.

కిక్కిరిసిన కూరగాయల తీర్థం: జిల్లాలో ఎక్కడా లేని విధంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కూరగాయల తీర్థం జరిగింది. సంక్రాంతి పండగలో రైతులు పండించిన పంటలను ఇక్కడ విక్రయిస్తారు. వీటిని కొనుగోలు చేసి సంక్రాంతి రోజున పూజ చేస్తే మంచి జరుగుతుందని ప్రతీతి.

అఖండ నామ సంకీర్తన



కింతలి వల్లాపురంలో పాల్గొన్న భక్తులు

నాతవరం: భజన కీర్తనలు పాడుతూ మేలు కొలుపు కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజల్లో భక్తి భావం అలవడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచారకుడు సినీ నటుడు లోకారపు జోగినాయుడు (జోగిబ్రదర్స్) తెలిపారు. చెర్లోపాలెం, నాతవరం గ్రామాల్లో మేలుకొలుపు ముంగిపు కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు. పుర వీధుల్లో సీతారాముడు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ భజనలు చేసి ఉత్సాహ పరిచారు.

జేడీపేటలో భారీ అన్న సమారాధన

మాడుగుల/మాడుగుల రూరల్: ధనుర్మాస ఉత్సవాలు ముగిసిన సందర్భంగా జేడీపేట రామాలయం వద్ద వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జి.అగ్రహారంలోని వేడుకల్లో ఎంపీటీసీ ఆర్లె మాధవి దంపతులు పాల్గొన్నారు.

రోలుగుంట: మేలుకొలుపులు ముగియడంతో స్థానిక సిద్ధు వినాయక సంఘం ఆధ్వర్యంలో రంగనాథాచారి, గోదాదేవి చిత్రపటాలను పురవీధుల తోపాటు కొండపాలెం, కొవ్వూరు తదితర గ్రామాల్లో ఊరేగించారు. భక్తుల నుంచి స్వీకరించిన కానుకలు, సరుకులతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం రామాలయంలో హరేరామ అఖండ నామసంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: మండల కేంద్రంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని వెంటనే ఆపాలని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, గిరిజన సంఘం మండల కార్యదర్శి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో జెడ్పీటీసీతో పాటు సర్పంచ్‌లు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కొండలరావు, సర్పంచ్‌లు రంజిత్, పోతురాజు, వెంకట్, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం, సీపీఎం, గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్, కృష్ణారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

రాంబిల్లి: దిమిలిలో వల్లభనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. భోగి పండగ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.